Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU





అమరావతి  సంపుటి (Vol) : 7  సంచిక (Issue) : 325  పేజీలు (Pages) : 8  వెల : రూ. 2.00  ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 12 - 8 - 2026

94406 62699  rajadhanivartalu  rajadhaniv  www.rajadhanivartalu.com  NI No.: APTEL/2019/77985  Postal regd: GTR/114/2025-27  స్థాపితం : 2015

## ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు సమీక్ష.. అధికారులకు కీలక సూచనలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ స్థూల దేశీయోత్పత్తి, నెలవారీ ఆర్థిక నివేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలకు సంబంధించిన ఆర్థిక నివేదికను ప్రణాళికా విభాగం అధికారులు ముఖ్యమంత్రికి అందజేశారు. ఎల్‌నినో సంక్షోభంలోనూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సానుకూల వృద్ధిని నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రాష్ట్రం 10.7 శాతం వృద్ధిరేటు నమోదు చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో 13.5 శాతం, పారిశ్రామిక రంగంలో 10.6 శాతం, సేవల రంగంలో 9.9 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారులు తెలిపారు. సాధారణ ఎగుమతుల్లో రూ.16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి రికార్డైనట్లు వెల్లడించారు. టెక్నాలజీ ఇంటిగ్రేషన్ కారణంగా జీఎస్టీ పన్ను వసూళ్లు.. 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరిందన్నారు. రూ.2.88 లక్షల కోట్ల భారీ, మెగా ప్రాజెక్టుల గ్రౌండింగ్, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులతో 73.6 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఎల్‌నినో కారణంగా ఈ సీజన్‌కు రాష్ట్రవ్యాప్తంగా 51.8 శాతం మేర లోటు వర్షపాతం నమోదైందన్నారు. 2023–24లో రియల్ జీఎస్డీపీ 6.5 శాతంగా ఉంటే 2025–26 ఏడాదికి 9.9 శాతానికి పెరిగినట్లు తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా అందుబాటులో ఉన్న వనరుల నిర్వహణ చేపట్టాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. అలాగే, సామాన్య ప్రజలపై అదనపు ధరల భారం పడకుండా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ వృద్ధి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఎల్‌నినో సంక్షోభం నేపథ్యంలో నీటి లభ్యత, ఉత్పత్తుల విలువ జోడింపుపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా ప్రణాళికల విడుదల ద్వారా లక్ష్య సాధన సులువవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

## విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది: పీవీఎన్ మాధవ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సి పరీక్షలో అవకత వకలు జరిగినట్లు తేలిందని.. ఈ క్రమంలోనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. వారిపైనా రబ్బర్ బుల్లెట్స్, లాఠీఛార్జి చేశారన్నారు. జీజీవీ, కాంగ్రెస్ ప్రభుత్వమే అక్కడ నడుస్తోందని చెప్పారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తెలిసిన వెంటనే పరీక్ష రద్దు చేశామని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేశారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదే అని చెప్పుకొచ్చారు. జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సీ పేపర్ లీక్ వల్ల ఎంతో మంది యువత జీవితం రోడ్డు పాలవుతోందని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. కేంద్రంలో తప్పు జరిగిందని.. వెంటనే దాన్ని కరెక్ట్ చేశామని అన్నారు. రాహుల్ గాంధీ పిరికివారని.. అందుకే పార్లమెంట్‌కు రాకుండా పారిపోతున్నారని విమర్శించారు. పేపర్ లీక్‌పై చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలపై జగన్, షర్మిల ముందుకు రావాలన్నారు. వైసీపీ



దిక్కుతోచని స్థితిలో ఉందంటూ వ్యాఖ్యానించారు. డీఎస్సీ పూర్తి పారదర్శకంగా జరిగిందని..ఏం చేయాలో తెలియక వైసీపీ కావాలని రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. క్రీడా కోటాలో ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షుడు అన్నారు. వైసీపీ చేస్తున్న నిరసనలను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో చేసినట్లు, తమ జీవితాలను నాశనం చేయొద్దని ఉద్యోగులు కూడా ఆందోళన చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని.. విశాఖలో అత్యధిక స్థానాల్లో కూటమి ప్రభుత్వం గెలుస్తుందని పీవీఎన్ మాధవ్ ధీమా వ్యక్తం చేశారు.

## శ్రీకాళహస్తి హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నలుగురి అరెస్ట్



**తిరుపతి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తిలో సంచలనంగా మారిన హత్య కేసును తిరుపతి జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి అంతర్రాష్ట్ర నేరచరిత్ర కలిగిన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఆగస్టు 2న రాత్రి 7:30 గంటల సమయంలో శ్రీకాళహస్తి పీఆర్ గేట్ ప్రాంతంలో స్వర్ణముఖి నది కట్టపై శివ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. టెక్నికల్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి.. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన ముగ్గురు, పుత్తూరుకు చెందిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై తమిళనాడు రాష్ట్రంలో గతంలో పలు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చెన్నైకి చెందిన థొప్పై గణేశన్ గ్యాంగ్‌తో నిందితులకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన బైక్, రెండు కత్తులు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

## పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలి... ప్రధానికి వీహెచ్ లేఖ

**న్యూఢిల్లీ :** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య సమరయోధుడుకి, భారత జాతీయ పతాక రూపకర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి ఇదే అని చెప్పుకొచ్చారు. భారత జాతీయ పతాకం (త్రివర్ణ పతాకం) ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు లేఖలో తెలిపారు. ఇప్పుడు భారత జాతీయ పతాకం ప్రపంచ వ్యాప్తంగా ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వీహెచ్ అన్నారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం.. భారత పతాక రూపకర్తకు జరిగిన అవమానమన్నారు. జాతీయ పతాక రూపకర్తకు భారతరత్న ఇవ్వాలని.. దేశ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని వెల్లడించారు. 'ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా' అంటున్నారు.. మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు' అని ప్రధానికి వీహెచ్ లేఖ రాశారు.

## ఆగస్టు 15న జెండా పండుగను సగర్వంగా నిర్వహించుకుందాం: ప్రధాని మోదీ




**ఢిల్లీ:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడు కలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ త్రివర్ణ ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడా లని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోదీ పేర్కొన్నారు.

## ఆక్వా రైతులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆక్వా రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆక్వా రైతన్నలకు విద్యుత్ రాయితీ కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నదాతలకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50లకే అందించనుంది. ఈ మేరకు ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీపై మంగళవారం ఎనర్జీ శాఖ జీవో ఆర్టీ నంబర్– 57 జారీ చేసింది. కొత్తగా ప్రకటించిన ఆక్వా జోన్లలోని అర్హత కలిగిన అన్ని ఆక్వా ఫారాలకు రూ.1.50లకే యూనిట్ రాయితీని ఏపీ సర్కార్ కల్పించనుంది. APSADA, CAA చట్టాల కింద రిజిస్టరైన అన్ని అర్హత కలిగిన ఆక్వా ఫారాలకు కూడా రూ.1.50లకే యూనిట్ విద్యుత్‌ను ఏపీ సర్కార్ అందించనుంది.

సుమారు 6,500 రిజిస్టర్డ్ ఆక్వా ఫారాలకు ఈ రాయితీ వర్తించనుంది. భవిష్యత్తులో APSADA, CAA రిజిస్ట్రేషన్ పొందే అర్హత కలిగిన ఈ ఫారాలకు కూడా రిజిస్ట్రేషన్ తేదీ నుంచి రాయితీ కల్పించనుంది. 2026 జూన్ 1వ తేదీ నుంచి రూ.1.50లకే యూనిట్ రాయితీని అమలు చేయనుంది. ఆక్వా ఉత్పత్తి వ్యయంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతన్నలకు ఏపీ సర్కార్ నిర్ణయంతో ఊరట కలిగింది. ప్రపంచ ఆక్వా ఎగుమతుల మార్కెట్‌లో పోటీ ధర, నాణ్యతతో నిలదొక్కుకునేందుకు ఈ విద్యుత్ రాయితీ అందిం చనుంది. ఆక్వా రైతుల వివరాలను మత్స్యశాఖ DISCOM లకు అందించనుంది. మత్స్యశాఖ ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం రాయితీ విస్తరణకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.



# ఆంధ్ర రైజింగ్ స్టార్ నారా లోకేష్






**(రాజధాని వార్తలు):** " ఫార్చ్యూన్ ఇండియా" అనే జాతీయ ఆంగ్ల పత్రిక ఇచ్చిన" ఆంధ్ర రైజింగ్ స్టార్" అనే గుర్తింపు యువనాయకుడు ఆంధ్ర ప్రజల ఆశాకిరణం విద్య శాఖ మంత్రి నారా లోకేష్ రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలు రాయిగా భావించవచ్చు. ప్రభుత్వ నిర్ణయాలను క్షేత్ర స్థాయిలో ఫలితాలుగా మార్చడం, పెట్టుబడుల ప్రకటనలు వాస్తవ పరిశ్రమలుగా మారి యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ, ముందుకు సాగుతున్న లోకేష్‌కు లభించిన రైజింగ్ స్టార్ ఓ గౌరవంగా భావించాలి. రాజకీయాల్లో వారసత్వం అనేది ఒక మెట్టు మాత్రమే. కానీ ఆ మెట్టుపై నిలబడి గమ్యాన్నిచేరుకోవడానికి కావాల్సిన శ్రమ, పట్టుదల ఉంటేనే చరిత్ర గుర్తిస్తుంది. అనతి కాలంలోనే రాజకీయంగా తనకంటూ ఒక గుర్తింపు సాధించిన నాయకులు బహుఅరుదుగా కనిపిస్తారు. అయితే రాష్ట్ర ఐటి, మానవవనరుల శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు నారా లోకేష్ ఆ కోవకే చెందుతారు. ఇదే విషయాన్ని ప్రముఖ ఇంగ్లీషు పత్రిక "ఫార్చ్యూన్ ఇండియా" తన ఆగస్టు సంచికలో స్పష్టం చేసింది. "ఆంధ్రాస్ రైజింగ్ స్టార్ హౌ నారా లోకేష్ "అంటూ మంత్రి, యువనేత నారా లోకేష్‌ను ప్రశంసిస్తూ ప్రచురించిన కథనం తెలుగు ప్రజలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. 40 అండర్ 40 విభాగంలో లోకేష్‌ను ఎపి భవిష్యత్ రాజకీయాల్లో కీలక నాయకుడిగా పేర్కొనడాన్ని చూస్తే ఆయనను తెలుగు ప్రజల ఆశాకిరణంగా అభివర్ణించవచ్చు. అంతర్జాతీయ ఆంగ్ల పత్రిక గుర్తించే స్థాయికి ఒక నాయకుడుగా ఎదగడమంటే ఆషామాషి కాదు. 2019కి ముందు నారా లోకేష్‌ను కేవలం ఒక ముఖ్యమంత్రి కుమారుడిగా రాజకీయపరిపక్వత లేని నాయకుడంటూ ప్రచారం చేసిన వైసీపి పార్టీలకు ఫార్చ్యూన్ పత్రిక ప్రచురించిన కథనమే ఒక చెంపపెట్టు లాంటిది. యువగళం నాయకుడిగానే కాకుండా మంత్రి పనితీరుతో ఇప్పుడు ఒక రాజకీయ నాయకుడి ఇమేజ్‌కు లోకేష్ పరిమితం కాలేదు. రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త "టెక్నో - పొలిటికల్ శకానికి ఆయన దారులు వేశారనే చెప్పాలి. అందుకే ఫార్చ్యూన్ ఇండియా ఆంగ్లపత్రిక నారా లోకేష్ ను ఆగస్టు 2026 సంచికలో ఆంధ్రప్రదేశ్ రైజింగ్ స్టార్ (ఉద్భవిస్తున్న తార) అభివర్ణించిదనడంలో సందేహం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారా లోకేష్ చేపడుతున్న విధి విధానాలు తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రంలో నూతన శకానికి నాంది పలుకుతున్నాయని ఆసంచికలో ప్రశంసిచడం ప్రధాన అంశంగా చెప్పవచ్చు.. ఐటి, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన క్షణం నుంచి నారా లోకేష్ రాష్ట్రాన్ని పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు.విశాఖపట్నంలో గూగుల్ ప్రాజెక్టు ఎ.పి సాంకేతిక విప్లవానికి ఒక మైలు రాయిగా నిలిచింది.

అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, ఆటోమో టివ్ రంగాల్లో విదేశీ, స్వదేశీ దిగ్గజ సంస్థల నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 ఇండస్ట్రీయల్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నారని ఫార్చ్యూన్ ఇండియా కథనం ప్రస్తుతించింది. యువగళం ద్వారా ఆయన ప్రజలతో మమేకమై వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ఆయన రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన ఘట్టం. ఆ పాదయాత్ర ద్వారానే లోకేష్ ప్రజా నాయకుడిగా ఎదిగి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. లోకేష్ కేవలం పాతతరం రాజకీయ నాయకులకు మాత్రమే పరిమితం కాకుండా నేటి "జెన్ -జీ" యువతతో నిరంతరం మమేకమవుతున్నారు. వారసత్వం దాటి సొంత ముద్ర దిశగా అడుగులు వేస్తూ పరిణితి చెందిన టెక్నో పొలిటిషియన్ నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆశిద్దాం.

**వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# 13న రామకృష్ణానందకు మానాప్రగడ శేష శాయి స్మారక పురస్కారం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** మధుర వచస్వి మానాప్రగడ శేష శాయి స్మారక పురస్కారం 2026 సంవత్సరానికి గాను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు భీమిలికి చెందిన ప్రవచన వాచస్పతి రామకృష్ణానందకు ప్రదానం చేయనున్నట్లు తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం శ్రీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రొఫెసర్ స్వప్న హైందవి ప్రధాన వక్తగా పాల్గొంటారని, సన్మానకర్తలుగా దుర్గా బాలాజీ ఉమాదేవి దం పతులు వ్యవహరిస్తారని, మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి ముఖ్య అతిథిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈరోజు ఏర్పాటు చేసిన సమావేశంలో కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుబ్బారావుతో కలిపి ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సలహాదారు సుభద్రాదేవి, రచయిత కాగుపాటి నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి : అంగేరి పుల్లయ్య




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపు మేరకు సోమవారం శ్రీకాళహస్తిలో జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయాన్ని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల నాయకులు రైతులు, కార్మికులతో కలిసి ముట్టడించారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో తిప్పి కొట్టాలని పుల్లయ్య పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, వ్యవసాయ కూలీలకు 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.700 దినసరి వేతనం అందించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యవసాయ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసేలా అమెరికాతో చేసుకున్న అన్ని స్వేచ్ఛా ఒప్పందాలను రద్దు పర్చాలని స్పష్టం చేశారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్, వెంకటేష్, గురునాధం, రాజా, చుట్టు గురవయ్య, వసాయ కార్మిక సంఘం నాయకులు రమణయ్య, సుబ్బయ్య, జేకే రమణయ్య, రైతు సంఘం నాయకులు రంగయ్య, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎస్‌బి శిక్షణకు ఐ & పిఆర్ డైరెక్టర్ విశ్వనాథన్, ఇన్‌చార్జిగా మల్లవరపు సూర్యతేజ



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఐఏఎస్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న 11వ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) గురువారం జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఆగస్టు 12 నుంచి 24 వరకు పంజాబ్‌లోని ఐఎస్బీ మొహాలీ క్యాంపస్‌లో నిర్వహించే రెసిడెన్సీ-1 కార్యక్రమంలో విశ్వనాథన్ పాల్గొంటారు. ఈ కాలంలో ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లేందుకు కూడా ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. అలాగే, శిక్షణా కాలాన్ని పూర్తిగా "ఆన్ డ్యూటీ"గా పరిగణించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విశ్వనాథన్ శిక్షణలో పాల్గొనే 13 రోజుల పాటు ఆయన నిర్వహిస్తున్న అన్ని బాధ్యతలను 2020 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి మల్లవరపు సూర్యతేజకు పూర్తి అదనపు బాధ్యతలుగా అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ కాలంలో ఐ & పిఆర్‌శాఖ పరిపాలనా బాధ్యతలను సూర్యతేజ నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా, ఈ ప్రతిష్ఠాత్మక పబ్లిక్ పాలసీ శిక్షణా కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుంచి మరికొందరు ఐఏఎస్ అధికారులు కూడా హాజరు కానున్నారు. ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ కూడా ఐఎస్బీ మొహాలీ క్యాంపస్‌లో జరిగే ఈ శిక్షణలో పాల్గొనేందుకు పంజాబ్‌కు వెళ్లనున్నారు. ప్రజా విధానాల రూపకల్పన, పరిపాలనా సామర్థ్యాల పెంపు, పాలనలో ఆధునిక విధానాల అమలుపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించే ఈ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా ఐఏఎస్ అధికారులకు ప్రతిష్ఠాత్మక శిక్షణా కార్యక్రమంగా గుర్తింపు పొందింది.

# నగరంలో భారీ హర్ ఘర్ తిరంగా యాత్ర








**మచిలీపట్నం, (రాజధాని వార్తలు):** సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో చారిత్రాత్మక మచిలీపట్నంలో భారీ మువ్వన్నెల జెండా యాత్ర ఘనంగా జరిగింది. "హర్ ఘర్ తిరంగా" ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండు వందల అడుగుల పొడవు భారీ మువ్వన్నెల పతాకంతో నిర్వహించిన ర్యాలీని ఎన్సీసీ 16వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రూపేష్ అవస్థి జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని వివిధ విద్యా సంస్థలు, పాఠశాలలకు చెందిన మూడు వందలకు పైగా ఎన్సీసీ క్యాడెట్లు త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శనగా దేశ భక్తి, వందేమాతరం, హర్ ఘర్ తిరంగా నినాదాలతో చేసిన ర్యాలీ ప్రజలను ఆకట్టుకున్నది. భారతి కళాసమితి డప్పు కళాకారులు ప్రదర్శన అగ్రభాగాన లయబద్ధమైన సంగీతంతో ఆకర్షణగా నిలిచారు. కోనేరు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ వీధులగుండా సాగి ఆంధ్ర జాతీయ కళాశాల వద్ద ముగిసింది. హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ, ప్రతి ఇంటా మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడమే కాకుండా, నషా ముక్త్ భారత్, టీబీ ముక్త్ భారత్ వంటి సామాజిక సందేశాలను ఇవ్వడమే లక్ష్యమని కల్నల్ రూపేష్ అవస్థి చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక ఘట్టాలకు కేంద్రమైన మచిలీపట్నంలో మువ్వన్నెల జెండాను జాతీయ పతాక రూపకర్త శ్రీ పింగళి వెంకయ్య స్వయంగా పనిచేసిన ఆంధ్ర జాతీయ కళాశాల వరకూ ప్రదర్శించడం ద్వారా విద్యార్థులు ఒక చారిత్రాత్మక అనుభవంలో భాగమయ్యారని సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ రమేష్ చంద్ర అన్నారు. అదే విధంగా, ఈగల్ విభాగం సహకారంతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలతో ఎన్సీసీ 16వ బెటాలియన్ కేడెట్లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ కమాండెంట్ చందన్ ఠాకూర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కన్నబిడ్డను కోల్పోవడం తల్లిదండ్రులకు తీరని వేదన : హోంమంత్రి వంగలపూడి అనిత

**- విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా అకాల మరణం తీవ్రంగా కలచి వేసింది**
**- ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పిన హోంమంత్రి - డీసీపీ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించిన వంగలపూడి అనిత**





**విజయవాడ, (రాజధాని వార్తలు):** గుంటూరు జిల్లా ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం కుమార్తె అఫీఫా (24) అకాల మరణం చెందడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం విజయవాడలోని ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం నివాసానికి వెళ్లిన హోంమంత్రి అనిత ఆమెను, కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. కన్నబిడ్డను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్న షిరీన్ బేగంను ఓదార్చి ధైర్యం చెప్పారు. చీరాల బీచ్‌కు వెళ్తున్న సమయంలో ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అఫీఫా ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచి వేసిందని హోంమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 24 ఏళ్ల చిన్న వయసులోనే నిండు జీవితం ముగియడం అత్యంత బాధాకరమన్నారు. కన్నబిడ్డను కోల్పోవడం ఏ తల్లిదండ్రులకైనా తీరని వేదనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న హోంమంత్రి, ప్రమాదంలో గాయపడిన వారి వివరాలపై కూడా ఆరా తీశారు.

ఈ విషాద సమయంలో షిరీన్ బేగం, ఆమె కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు. అఫీఫా అకాల మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన హోంమంత్రి వంగల పూడి అనిత, షిరీన్ బేగం కుటుంబానికి తన ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం, మనోస్థైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# ఐక్యతతోనే క్రైస్తవుల హక్కులను సాధించుకోగలము

## - దళిత క్రైస్తవులపై ప్రభుత్వం చిన్న చూపు - 1950 ఆగస్టు 10 దళిత క్రైస్తవులకు చీకటి రోజు

## - ప్రెసిడెన్సీఎల్ ఆర్డర్ పేరా.3ని తొలగించాలి - గళం విప్పిన దళిత క్రైస్తవ సంఘ నాయకులు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారతదేశంలో దళిత క్రైస్తవులకు ఆగస్టు 10వ తేదీ చీకటి రోజుగా పరిగణించాల్సి వచ్చిందని దళిత క్రైస్తవ సంఘం నాయకులు వారి గళం విప్పారు. సోమవారం నెల్లూరు టౌన్ హాల్ ఏ/సి నందు జై భీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన దళిత క్రైస్తవ సంఘ నాయకుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు డా.మైనంపాటి యేసురత్నం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవ సంఘ నాయకులతో కలసి డా.మైనంపాటి యేసురత్నం సమావేశం నిర్వహించారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చకు రావడం, అందుకు తగిన సిద్ధపాటుతో తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రభుత్వం ముందు ఉంచి సాధించుకునే ప్రణాళికను సిద్ధం చేసుకొని అధికారుల దృష్టికి తెలియజేస్తూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఈ చర్చా కార్యక్రమంలో వెల్లడిపరిచారు. ఈ సమావేశంలో దళిత క్రైస్తవ సంఘ నాయకుల పెద్ద సంఖ్యలో పాల్గొని 7 అంశాలపై చర్చించి, వాటికి పరిష్కార మార్గాలు కూడా సిద్ధం చేసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. భారత దేశంలో క్రైస్తవులకు నిజమైన స్వాతంత్ర్యం ఉన్నదా..అనే ప్రశ్న లేవనెత్తారు, అందుకు సమాధానంగా వారి నుంచి వస్తున్న సమాధానం పరిశీలిస్తే.. మన భారత దేశంలో క్రైస్తవులకు నిజమైన స్వాతంత్ర్యం లేదని, అంటరానితనం, వివక్షతకు గురికాక తప్పడం లేదు అని స్పష్టం చేశారు. తద్వారా ఎస్సీ దళిత క్రైస్తవులుగా పిలువబడుతున్న వారు బలహీనపడుతున్నారని వ్యక్తం చేశారు. 1950 సంవత్సరంలో ప్రేసిడెన్షియల్ ఆర్డర్ పేరా–3 ప్రకారం ఎస్సీలు అనబడే దళిత క్రైస్తవులకు మతపరమైన ఆంక్షలు ఎందుకు పెట్టారు, అనే ప్రశ్నకు సమాధానంగా సమావేశంలో చర్చిస్తూ భారత రాజ్యాంగం ప్రకారం ఆర్టికల్ 25 ప్రకారం క్రైస్తవులకు మతపరమైన స్వేచ్ఛను కల్పించి ఉండగా, ఎస్టీ, బిసి, ఓసి సామాజిక వర్గం నుంచి క్రైతవులుగా కన్వర్ట్ అయిన వారికి మతపరమైన ఆంక్షలు లేవు అని, కేవలం ఎస్సీ సామాజికవర్గం నుంచి క్రైస్తవులుగా కన్వర్ట్ అయిన వారికి



మాత్రమే మతపరమైన ఆంక్షలు విధిస్తూ, మతపరమైన స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా ఆ నాటి పాలకులు ఎస్సీల మీద దృష్టి పెట్టి డా. బిఆర్ అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంను పౌరులందరు కలిగి ఉండాలి అని కోరుకుంటే, ఎస్సీల పట్ల వివక్షిత చూపించి, డా.బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచారని పేర్కొన్నారు. కనుక ఈ ప్రసిడేన్సీయల్ ఆర్డర్ ను పూర్తిగా రద్దు చేయాలని, రాజ్యంగా హక్కులు అందరికీ సమానంగా దక్కాలని, ఎస్సీలకు కూడా మతపరమైన స్వేచ్ఛను కలిగి ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే దేశంలోని అన్నీ కులాలనుండి క్రైతవ్యం లోనికి కన్వర్ట్ అయిన వారి సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, మతపరమైన లెక్కలలో ఎందుకు వీరందరిని చేర్చి పర్సంటెగ్ చూపడం లేదు అని ప్రశ్నించారు. అందుకు సమాధానంగా క్రైస్తవులు అంటే ఒక్క ఎస్సీలు మాత్రమే కాదని, ఎస్టీ, బీసీ, ఓసిలు కూడా క్రైస్తవులుగా కన్వర్ట్ అవుతున్నారని, అయితే మతపరమైన ప్రజా సంఖ్య వింటుంటే ఎంత అని అధికారికంగా తీసుకొని చూస్తే చాలా హాస్యాస్పదంగా ఉంది అన్నారు. ప్రభుత్వం అన్నీ మాతాలకు నిష్పక్షపాతంగా వారి వారి మతపరమైన ప్రజా సంఖ్యను అధికారికంగా చూపినట్లు అయితే, క్రైస్తవుల యొక్క జనాభా శాతం 25 నుంచి, 35 శాతం వరకు మన దేశంలో క్రైస్తవులు ఉన్నారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చూపుతున్న క్రైస్తవుల లెక్కలు సంఖ్య సరైనదేనా అనే ప్రశ్నకు, ప్రభుత్వం క్రైస్తవుల జనాభా సంఖ్య 2011 లెక్కల ప్రకారం 1.96 శాతం



అని, నెల్లూరు జిల్లాలోని సంఖ్య చూస్తే 22,202 గా చూపిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో 7లక్షల మంది అని, ఇది ప్రభుత్వ సంఖ్యగా క్రైస్తవుల సంఖ్యను చూపుతుంది అన్నారు. ఈ సంఖ్య ఏ ఒక్క క్రైస్తవుడిని అడిగినా ఉమ్మడి నెల్లూరు జిల్లా లోనే 8 లక్షల మందికి పైగా క్రైస్తవులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోటి మందికి పైగా ఉన్నారని తెలిసిందన్నారు. భారత దేశంలో క్రైస్తవ్యం కులమా..? మతమా.. ? బిసి–సి నీ కులం అంటామా..? మతం అంతమా.. ప్రపంచంలో క్రైస్తవ్యం అనేది అత్యధిక మంది మత విశ్వాసాన్ని అనుసరిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో 67 శాతం క్రిస్టియానిటి ఉంది. కనుక ఒక మతపరమైన జీవ మార్గం క్రైస్తవ్యం సిగ్గు చేటు. కులాల కేటగిరి లలో బీసీ. సి గా కన్వర్ట్ క్రిస్టియన్ అనే కులం పెట్టి, ఒక్క ఎస్సీ లను మాత్రమే క్రిస్టియన్‌గా కన్వర్ట్ అయితే బీసీ.సిలు అవుతారు, మరి ఎస్టీ, బీసీ, ఓసీ సామాజిక వర్గాల నుంచి వచ్చే వారు క్రిస్టియానిటిలోకి వస్తే వారు కన్వర్ట్ అవడానికి వారి మత విశ్వాసాన్ని, వారి మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వాలు వారి కన్వర్షన్‌కి చట్టబద్దత చేయడం లేదు. ఈ కారణం చేత ఎస్సీలలోనే బేధాభిప్రాయాలు, బీసీ.సి చట్టం వలన వస్తున్నాయి. కులాల వారీగా వచ్చిన రిజర్వేషన్ మతాలకు కలపకుండా ఈ బీసీ.సి కి ఇచ్చిన రిజర్వేషన్ 1 శాతం కూడా ఎస్సీలలో కలిపివేసి, బీసీ.సి అనేది లేకుండా ఎస్సీలకు వారి వారి ఇష్ట దైవాన్ని పూజించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే క్రైస్తవులను లెక్కల్లో పూర్తి స్థాయిలో చూపకపోవడం క్రైస్తవ్యానికి నష్టమా, లాభమా, క్రైస్తవులపై జరిగే దాడులు, వాటికి గల కారణాలు ఏమిటి, క్రైస్తవులపై దేశంలో జరుగుతున్న దాడులు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చర్చిలు కూలద్రోయుట, పాస్టర్లపై దాడులు, చంపుట, మైకులు పికివేయుట, వాహనాలపై దాడులు ఇలా, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించుట వంటివి సర్వ సాధారణముగ మారిపోయాయి.

దీనికి కారణం క్రైస్తవుల మంచితనం, శాంతి యుతమైన, ప్రజా ప్రయోజనకరమైన, ప్రజా శ్రేయస్సుకు పనిచేసే వారు గనుక, ఇట్టి వారిపై ఈర్ష్యతో రగిలిపోయే మత ఛందస్సా వాదులు, క్రైస్తవులపై దౌర్జన్యం చేస్తున్నారని, ఈ దాడులు ఆగాలి అంటే క్రైస్తవులకు చట్టబద్దత కల్పించి క్రైస్తవులకు న్యాయబద్ధంగా రావలసిన జనాభా శాతాన్ని నిష్పక్షపాతంగా చూపించి ప్రజాస్వామ్యంలో తమ రాజకీయ ప్రాధాన్యతను కల్పించాలి. క్రైస్తవులలో ఉండి కూడా రాజ్యాధికారంలో క్రైస్తవ జనాభా ప్రాతిపదికన రాజకీయంగా అవకాశం కల్పించాలి. ఈ కూటమి ప్రభుత్వం నామినేటెడ్ క్రిస్టియన్ ఎమ్మెల్యే పదవిని నియమించలేదు అని, ఇలాంటి దుస్థితిలో క్రైస్తవుల పరిస్థితి ఉంది అన్నారు. ఇక రాబోయే రోజుల్లో జై భీమ్ రావ్ భారత్ పార్టీ క్రైస్తవులకు అండగా ఉండి, రాజకీయ చైతన్యం కల్పిస్తూ, 175 నియోజకవర్గాలలో తమ పార్టీ అధినేత జడ శ్రావణ్ కుమార్ నాయకత్వంలో ప్రతి నియోజకవర్గంలో 50 వేల నుంచి 80 వేల వరకు ఉన్న క్రైస్తవ ఓట్ల మీద జై భీమ్ రావ్ భారత్ పార్టీ పనిచేస్తుంది అని, క్రైస్తవులకు అండగా ఉంటుంది అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్.సి.యం సౌత్ ఇండియా సెక్రెటరీ కలివేల ఎలీషా కుమార్, నెల్లూరు పాస్టర్ అసెంబ్లీ అధ్యక్షుడు రాఘవ మోజెస్, నెల్లూరు సిటీ జై భీమ్రావు భారత్ పార్టీ నాయకులు రఘునాథ్, నెల్లూరు రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జోసఫ్ బాబు, షేక్ జాన్సన్, బ్రాహ్మణ క్రిస్టియన్ లీడర్ చంద్రశేఖర్, వైసిపి క్రిస్టియన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ లక్కు స్వరాజ్, జై భీమ్రావు భారత్ పార్టీ కోవూరు నియోజకవర్గం ఇంచార్జ్ ప్రభు కుమార్, జై భీమ్ రావ్ భారత్ పార్టీ దళిత క్రైస్తవ సంఘ నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని వర్గాల వారికి టెట్ మార్కులు తగ్గించాలి:

## ఎంటిఏ, పిటిఎఫ్, ఆర్‌టిఏ సంఘాల డిమాండ్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం ఆగష్టులో నిర్వహిస్తానంటున్న స్పెషల్ టెట్ యందు జెనరల్ కేటగిరి టీచర్స్‌కి టెట్ అర్హత మార్క్‌లు 60శాతం నుండి 40శాతం వరకు తగ్గిస్తున్న వార్తలు నిజమే అయితే దానిని మా సంఘాల తరుపున మేము స్వాగతిస్తున్నాము.

అదే క్రమంలో జనరల్ కేటగిరి ఉపాధ్యా యులకు ఎంత శాతం మార్క్‌లు తగ్గిస్తారో అదే శాతం మార్క్‌లను ఎస్సీ, ఎస్టీ, బిసి ఉపాధ్యాయులకు అదే ప్రాతిపదికన అనగా జెనరల్ కేటగిరి వర్గాలకు 40శాతం (60మార్క్‌లు) బిసి వర్గాలకు 30శాతం (45మార్క్‌లు) ఎస్సీ/ఎస్టీ వర్గాలకు 20 శాతం (30 మార్క్‌లు) అర్హత మార్క్‌లు ఉండేలాగా రాజ్యాంగబద్దంగా జీ.ఓ.లో పొందుపరచాలని మహాజన టీచర్స్ అసోసియేషన్, పూలే టీచర్స్ పెడరేషన్, రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ సంఘాల తరుపున డిమాండ్ చేస్తున్నాము. జనరల్ అభ్యర్థులు, రిజర్వేషన్ అభ్యర్థులకు ఒకే అర్హత మార్కులను ప్రవేశ పెట్టడం రాజ్యాంగంలోని సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్దమని మేము విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలియజేసుకుంటున్నాము.అంతేగాక స్పెషల్ టెట్‌లో అర్హత సాధించిన ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయులకు భవిష్యత్‌లో జరిగే డిఎస్సీకి ఈ అర్హత మార్కులు ప్రామాణికంగా తీసుకొనేలా జీ.ఓ.లో ఉండాలని ఎస్సీ/ఎస్టీ ఉపాధ్యాయులకి డిఎస్సీ రాయడంలో ఎలాంటి న్యాయ అడ్డంకులు రాకుండా నిబంధనలు ఉండేలా తగు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుకుంటున్నాము. కావున ఉన్నతాధికారులు జనరల్ ఉపాధ్యాయులుకు ఏ ప్రాతిపదికన అర్హత మార్కులు సడలించారో అలాగే ఎస్సీ, ఎస్టీ, బిసి ఉపాధ్యాయులకు అర్హత మార్కులు అదే నిష్పత్తిలో తగ్గించి సామాజిక న్యాయం చేయాలని కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో మీూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మస్తాన్ మాదిగ చేమూరు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి దూడల పెంచలయ్య, పూలే టీచర్స్ పెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం శ్రీనివాసలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసలి సురేష్, రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ ఖాజా రంతుల్లా, ప్రధాన కార్యదర్శి కోలా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్పీ వేమారెడ్డి చేతుల మీదుగా

## ఐదు సిమెంట్ బెంచ్‌ల ఆవిష్కరణ









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ ఆవరణంలో డీఎస్పీ వేమారెడ్డి చేతుల మీదగా నోవా బ్లడ్ సెంటర్ వారు సౌజన్యంతో అందించిన ఐదు సిమెంట్ బెంచీలను పిర్యాదుదారులు కూర్చోవడానికి ఏర్పాటు చేసి, డీఎస్పీ చేతుల మీదగా ఆవిష్కరించారు. అలాగే గార్డెన్ వరల్డ్ సహకారంతో అక్కడున్నటువంటి పరిసర ప్రాంతాల్లో పూల మొక్కలను నాటి సంరక్షించడానికి సిద్ధం చేశారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ వేమారెడ్డి మాట్లాడుతూ, నోవా బ్లడ్ సెంటర్ వారు కేవలం రక్తాన్ని సకాలంలో అందించినమే కాకుండా, మేము అడిగిన వెంటనే ఇక్కడ సిమెంట్ బెంచీలు ఏర్పాటు సాకరించినటువంటి నోవా బ్లడ్ సెంటర్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే గార్డెన్ వరల్డ్ వారి సహకారంతో పూల మొక్కలను నాటారు ప్రత్యేకించి ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు, అలాగే రమణయ్య, ఎస్ఐ రమణయ్య, అలాగే పోలీసులు, అధికారుల సంఘం అధ్యక్షులు మద్దినేని ప్రసాద్, అలాగే శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్ నాయుడు, నోవా పాతాలపు అనిల్ కుమార్, మోపూరు కార్తీకేయ నాయుడు, గణకాల సుమ, మోపూరు రిషిత, సర్రేపల్లి సేవా సంస్థ అధ్యక్షుడు దోడల సుధీర్, మోపూరు కార్తీకయ్య నాయుడు, పాతాలపు హెమంత్, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ, మేము అడగంగానే ఈ ఏర్పాటు చేసినటువంటి నోవా బ్లడ్ సెంటర్ వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలియజేశారు. అలాగే మరింత మంది దాతలు కూడా ముందుకొచ్చి మహిళా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలని సుందరవనంలాగా తీర్చిదిద్దాలని కోరారు.

# "విజయవంతంగా జాతీయ నిరసన దినం"



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని పేరా "3" తొలగించాలని నిరసన ర్యాలీ. దళితులు క్రైస్తవ మతం అనుసరిస్తే వారికి షెడ్యూల్ కులాల హోదా నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ఆర్టికల్స్ 14, 15,16 21, 25 లకు వ్యతిరేకమని రాజ్యాంగ విరుద్ధమైన రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఒక కులం వారికి ఒక చట్టం మరొక కులం వారికి ఒక చట్టం అమలు చేయడం దళితులకు మత స్వేచ్ఛను నిరాకరించడమే. క్రైస్తవులపై, చర్చిలు, క్రైస్తవ ఆస్తులపై మతోన్మాద దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాపై వేసిన జస్టిస్ రంగనాథ మిశ్రా కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, లోకూర్ ఖేల్కర్ కమిషన్ మొదలుకొని రంగనాథమిశ్రా కమిషన్ వరకు కులం వేరు మతం వేరని దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాల్సిందేనని పేర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి ప్రజాస్వామ్య బద్ధమైనది కాదని పేర్కొన్నారు. 2022 లో జస్టిస్ బాలకృష్ణ కమిషన్ కాలయాపనకే తప్ప న్యాయం జరుగుతుందన్న నమ్మకము లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ర్యాలీ విఆర్ గ్రౌండ్స్ నుండి ప్రారంభించి బిఆర్ అంబేద్కర్‌కి పూలమాల అలంకరణ అనంతము కలెక్టరేట్ వరకు నినాదాలతో కొనసాగింది అనంతరం ముఖ్య వక్తలు మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కి ప్రధానమంత్రికి వినతిపత్రం అందజేయడం జరిగింది. కార్యక్రమం ఎస్సీ బీసీ కమిషన్ మరియు నెల్లూరు జిల్లా క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగింది. కమిషన్ కార్యదర్శి ఫాదర్ జోసఫ్ కుమార్, దళిత గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఎలిషా కుమార్ కలివెల, ఫాదర్ ఇన్నయ్య, ఫాదర్ వైడి హృదయరాజ్, ఫాదర్ రమేష్,ఊరందరు సురేంద్రబాబు, ఏం బర్నాబాస్, పాస్టర్స్ హనోక్,కె ఎస్ రాజు,రాజశేఖర్,రమేష్,కిషోర్, సునీల్, ఎనోష్, సునీల్ గవాస్కర్,విజయ్ కుమార్, జాన్సన్, జోసెఫ్, స్వరాజ్, యాకోబు, రాజేష్, ఆర్ సి ఎం ఫాథర్స్, సిస్టర్స్, పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు. పలువురు ఫాదర్లు సిస్టర్లు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

# 18 మంది సర్వేయర్లకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ:

## జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రీసర్వే కార్యక్రమాలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక సహకారంలో భాగంగా మొదటి విడతలో 18 మంది మండల భూ సర్వే అధికారులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ..రీసర్వే కార్యకలాపాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో భాగంగా భూ రికార్డుల డిజిటలైజేషన్, క్షేత్రస్థాయి సర్వే తదితర పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడతాయన్నారు. రీసర్వే కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు, సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయ కుమార్, సర్వే & భూ రికార్డుల శాఖ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అంతిమ పరిష్కారం.. 'నీట్' రద్దు!

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పేరుతో జెన్ జీ యువత, విద్యార్థులు ఇటీవల ఒక అపూర్వ నిరసన చేపట్టారు. ఆ ఆందోళన ఫలితంగా కాలవాహినిలో మరుగున పడిన వివిధ అంశాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. వాటిలో ఒకటి- 'నీట్' రద్దు; మరొకటి- 'విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి రాష్ట్రాల జాబితాలోకి తిరిగి చేర్చడం'. వైద్య విద్యా కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్‌లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే 'నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్' (నీట్)ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాటి నుంచీ అది వివాదాస్పదంగానే ఉన్నది. వైద్య విద్యలో శిక్షణ కోసం రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల వల్ల అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో పాటు విద్యార్థులపై విపరీతమైన ఆర్థిక భారం పడి, వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నందున జాతీయ స్థాయిలో ఒకే విధమైన ప్రవేశ పరీక్ష ఉండాలని కొందరు నిపుణులు సూచించారు. వైద్య విద్యలో ప్రవేశించడానికి అవసరమయ్యే అర్హతా పరీక్ష జాతీయ స్థాయిలో ఒకేవిధంగా ఉండాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) సైతం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ సూచనల మేరకు కేంద్రం 2013లో వైద్య విద్యకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష 'నీట్'ను ప్రవేశపెట్టింది. అయితే, అప్పటి నుంచి ఈ ఏడాది వరకు 5 సార్లు 'నీట్' నిర్వహణలో పలు అక్రమాలు సంభవించాయి. ఆ అవకతవకలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. వైద్య ప్రవేశ పరీక్షను పూర్తిగా రద్దు చేసి తిరిగి నిర్వహించిన సందర్భాలు... గతంలో 2015లో AIPమీ విషయంలో, తాజాగా 2026లో నీట్ విషయంలో చోటు చేసుకున్నాయి. ఇది గమనార్హమైన వాస్తవం. 'నీట్'కు ప్రతి ఏటా హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య సగటున 21 లక్షలు ఉంటుండగా, వారిలో 11 నుంచి 13 లక్షల మంది దాకా అర్హత సాధిస్తున్నారు. వీరిలో కేవలం 1 లక్షా 10 వేల నుంచి 1 లక్షా 25 వేల మంది వరకూ ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశం పొందుతున్నారు. అంటే, 'నీట్' రాసిన వారిలో సీట్లు పొందేవారి సంఖ్య కేవలం 6 శాతంగా మాత్రమే ఉంటోంది. విధానపరంగా చూసినప్పుడు జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించడం అన్నది సముచితంగా కనిపిస్తోంది. అయితే 'నీట్' నిర్వహణలో అనేక లోపాలు, వైరుధ్యాలు ఉన్నాయనేది ఒక వాస్తవం. లక్షలాది విద్యార్థుల జీవితాలతో ముడివడి ఉన్న 'నీట్'ను లోపరహితంగా నిర్వహించలేకపోవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోంది. ఈ ఏడాది (2026) 'నీట్' పరీక్ష రద్దు కావడంతో 12 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. జీవితాన్ని పణంగా పెట్టి కష్టపడి చదివే విద్యార్థులకు పేపర్ లీకేజీ వంటి అక్రమాలు అశనిపాతంగా పరిణమిస్తున్నాయి. పరీక్ష రద్దు కావడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికిలోనై కుప్పకూలిపోతున్నారు. రెండోసారి ఫీజు లేకుండా పరీక్ష నిర్వహించినప్పటికీ.. అందుకు చాలామంది విద్యార్థులు సన్నద్ధం కాలేకపోవడం ఓ చేదు వాస్తవం. 'నీట్'ను రద్దు చేయాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే పరీక్షా పత్రాల లీకేజీలు, ఇతర అక్రమాల వంటివి మాత్రమే కాకుండా అసలు ఈ పరీక్షను నిర్వహిస్తున్న తీరే దేశ సమాఖ్య వ్యవస్థను సవాల్ చేసే విధంగా ఉండటం ప్రధానంగా కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ దేశంలోని 22 భాషల్ని అధికారికంగా గుర్తించింది. అయితే ఆశ్చర్యకరంగా 'నీట్' ప్రశ్న పత్రం 13 భాషల్లో మాత్రమే ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించడానికే 'నీట్' అని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఈ లోపాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఈ 13 భాషలలో ప్రవేశం లేని విద్యార్థులు తమకు రాని ఏదో ఒక భాషలో లేదా ఇంగ్లీషును ప్రత్యామ్నాయంగా ఎంచుకొని అందులో పరీక్ష రాయాలి. అంటే, 'నీట్'లో 9 భాషల విద్యార్థులకు ఎంత అన్యాయం జరుగుతుందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ సరిపోతుంది. 'నీట్'లో మరో కీలకమైన లోపం ఏమంటే ప్రశ్న పత్రాన్ని 'సీబీఎస్‌ఈ' సిలబస్‌ను ఆధారం చేసుకొని రూపొందిస్తున్నారు. విద్యార్థుల్లో అత్యధికులు తమ రాష్ట్రంలో అమలు చేసే రాష్ట్ర సిలబస్‌ను మాత్రమే చదువుతారు. అంటే, 'నీట్'కు హాజరవుతున్న సీబీఎస్‌ఈ సిలబస్ విద్యార్థులకు ఇతరుల కంటే అదనపు ప్రయోజనం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'నీట్' రద్దు చేయాలని మొదటి నుంచీ పలు విధాలా పోరాటం చేస్తున్న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం '2021లో వైద్య విద్యా ప్రవేశాలపై ఆ జాతీయ ప్రవేశ పరీక్ష ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి 'ఏకే రాజన్' కమిటీని ఏర్పాటు చేసింది. కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందేవారికే 'నీట్'లో దాదాపు 90 శాతం సీట్లు లభిస్తున్నాయని, 'నీట్' అన్నది వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారిందని, మెడికల్ డాక్టర్ కావాలనుకుంటున్న పేద, వెనుకబడిన వర్గాల హక్కులను, ప్రయోజనాలను ఇది కాలరాస్తోందని ఏకే రాజన్ కమిటీ నివేదిక వెల్లడించింది. మరి ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న సహజంగానే సర్వత్రా చర్చకు వస్తోంది: 'విద్య అన్నది విద్యార్థి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కోసం నేర్చుకునేదా? లేక విజ్ఞానం, నైపుణ్యాలు సముపార్జించి, తద్వారా ఉపాధి పొందే మార్గంగా ఎంచుకునేదా?' 'నీట్' పరీక్ష లేనప్పుడు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వైద్య విద్యనభ్యసించి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడి ప్రసిద్ధ వైద్యులుగా భారతీయులు ఎంతో పేరు గడించారని కొందరు గుర్తు చేస్తున్నారు. గల్ఫ్ దేశాలలో, ఇంగ్లాండ్‌లో ఉన్న వైద్యులలో 20శాతం మంది భారతీయులేనని గణాంకాలు తెలియజేస్తున్నాయి.

# కోటలో వైసీపీ భారీ నిరసన...ఎమ్మెల్యేపై దొరబాబు ఆరోపణలు






**సామర్లకోట, (రాజధాని వార్తలు):** డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ చేపట్టిన నిరసన ర్యాలీ ప్రభంజనంగా సాగింది. సోమవారం నియోజక వర్గం వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో సామర్లకోట మెహెర్ కాంప్లెక్స్ నుండి రైల్వే స్టేషన్ సెంటర్ వరకూ నిర్వహించారు. దీనిలో వేల సంఖ్యలో నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు వైసిపి నాయకులు కార్యకర్తలు తరలి వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు, అమలుకాని నిరుద్యోగ భృతి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని దొరబాబు డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాల్లో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో జరిగిన అక్రమాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని గత వారం రోజులుగా పలు రకాలుగా నిరసనలు చేయడంలో భాగంగా ఈ రోజు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రభుత్వంలో ఏ వర్గమూ సుఖంగా లేదన్నారు. ఒకపక్క రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతుండగా, మరోపక్క మహిళలకు నెల నెలా ఇస్తానన్న రూ. 1500 ఇవ్వడం లేదన్నారు. మెరిట్ లిస్టులో లేక రిజెక్ట్ అయిన చినరాజప్ప సమీప బంధువు భార్య దొంగ సర్టిపికెట్‌తో ఉద్యోగం సంపాదించకపోతే బహిరంగ చర్చకు రమ్మని చినరాజప్పకు దొరబాబు సవాల్ విసిరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలనే లక్ష్యంతో ఈ రోజు పోరాటాలు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా దేవరపల్లిలో జగన్ వచ్చిన వెంటనే పొగాకు రైతులకు న్యాయం జరిగింది. ఇలా ఎవరికి ఎటువంటి అన్యాయం జరిగినా ముందు స్పందించేది జగన్మోహన రెడ్డి, ఆయన సైన్యం అన్నారు. ప్రజలందరూ విసిగిపోయి ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, మరలా జగన్మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామా అని ఎదురు చూస్తూ ఉన్నారన్నారు. ఇంకా ఎంతో అభివృద్ధి చేసామని ఇంటింటికీ తెలుగుదేశం అనే కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్ళలేక, ఒకటో రెండో ఇళ్ళకు వెళ్ళి ఫొటోలు తీసుకుని తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. తాను పెద్దాపురం నియోజకవర్గంలో పుట్టానని, నియజకవర్గ ప్రజలందరికీ తాను తెలుసునని, నీ దగ్గర నేర్చుకునే పరిస్థితిలో నేను లేను అని ఎమ్మెల్యే కుమారుడు రంగనాగ్ నుద్దేశించి అన్నారు. నేను అసత్య ఆరోపణలు చేయడం లేదని, ప్రతిదానికి నావద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. అలాగే మైనర్ బాలిక అత్యాచారం జరిగితే కేసు కూడా పెట్టకుండా ముడుపులు తీసు కోలేదా అని దొరబాబు ప్రశ్నించారు. రాగంపేటలో మీ సొంత లేవుట్‌కు న్యాయం జరగాలని అక్కడ ఉన్న 60 మంది లబ్దిదారులకు అన్యాయం చేసి వృద్ధాశ్రమం పేరుతో ప్రజలకు మోసగించడం లేదా అని ప్రశ్నించారు. 10 రోజులుగా పట్టణానికి చెందిన చిన్నపిల్లలకు జాండీస్, టైఫాయిడ్ వచ్చి ఆసుపత్రిలో చేరగా మేము అక్కడకు వెళితే మీరు రాజకీయం చేస్తున్నారని అనడం సరికాదన్నారు. ఇలా ఉండగా ప్రజలకు ఎక్కడ ఏ అన్యాయం జరిగినా మేము అక్కడతాము ఉంటామన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో ఎక్కడ అన్యాయంగా గ్రావెలింగ్ జరిగినా, అన్యాయంగా ఏ లారీ దొరికినా, దాన్ని సాక్ష్యాధారాలతో సోషల్ మీడియాలో పెడితే లారీని పట్టించిన ప్రతి ఒక్కరికీ 5 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంకా ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్ మోజెస్, ఆవాల లక్ష్మీనారాయణ, బొబ్బరాడ సత్తిబాబు, తలారి దొరబాబు, సేపెని రూప సురేష్ కుమార్, పాలిక కుసుమ చంటిబాబు, నియోజకవర్గ పరిధిలోని పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సేవాదళం ఆధ్వర్యంలో ప్రజ్ఞ క్విజ్-2026 పోటీలు

**- మొదటి బహుమతి సాధించిన విద్యార్థికి రూ.10 వేలు, రెండవ బహుమతి విద్యార్థికి రూ. 6000 ప్రోత్సాహక బహుమతి**






**అల్లవరం, (రాజధాని వార్తలు):** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సేవాదళం సభ్యుల ఆధ్వర్యంలో ప్రజ్ఞ-2026 క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. అల్లవరం,ఉప్పలగుప్తం, మామిడికుదురు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మూడు దశలలో ఈ క్విజ్ పోటీలు నిర్వహించి ఫైనల్ రౌండ్ క్విజ్ పోటీలను సోమవారం ఓడలరేవు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పర్యావరణం, జనరల్ నాలెడ్జ్, సైన్స్, క్రీడలు, చరిత్ర, జియోగ్రఫీ, రాజకీయ, సామాజిక అన్ని రంగాలకు సంబంధించి ఈ క్విజ్ పోటీలను నిర్వ హించారు. ఈ క్విజ్ పోటీలలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10 వేల రూపాయలు రెండవ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.6 వేల రూపాయలు మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.4 వేల రూపాయలు చొప్పున నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్స్, మెడల్స్‌ను విజేతలకు సేవాదళం సభ్యులు అందజేశారు. అలాగే ఈ క్విజ్ పోటీలలో పాల్గొన్న మిగిలిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ క్విజ్ పోటీలలో ఓడలరేవు ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలువగా గొల్లవిల్లి, కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలు రెండు, మూడు స్థానాలలో నిలిచాయి. ఓడలరేవు గ్రామానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన సేవాదళం విద్యను, విద్యార్థులలో పోటీతత్వం పెంచేందుకు, విద్యార్థులలో దాగి వున్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకు ఇటువంటి క్విజ్ పోటీలను నిర్వహించడంతోపాటు రక్తదాన శిబిరాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మానవతా సహాయం, పేదలకు, పేద విద్యార్థులకు అండగా నిలవడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు సేవాదళం సభ్యులకు అభినందనలు తెలిపారు. క్విజ్ పోటీలను ప్రోత్సహించిన గ్రామస్తులకు, క్విజ్ పోటీలకు సహకరించిన అల్లవరం, మామిడికుదురు, ఉప్పలగుప్తం మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులకు సేవాదళం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : రూరల్ సీఐ ఇబ్రహీం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రూరల్ సీఐ ఇబ్రహీం తెలిపారు. అలాగే మొక్కలు నాటుదామని పర్యావరణాన్ని కాపాడుదామను నియోజకవర్గం జనసేన నాయకులు దండి నరేంద్ర కోరారు. అదేవిధంగా మొక్కల సంరక్షణే పర్యావరణ పరిరక్షణకు తొలి అడుగు అని ముచ్చివోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు చిరంజీవులు విజ్ఞప్తి చేశారు. డీజీపీ స్ఫూర్తితో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి రూరల్ సీఐ ఇబ్రహీం సహకారంతో, శ్రీ కాళహస్తి మండలంలోని ముచ్చివోలు జడ్పిహై స్కూల్ ఆవరణలో టీచర్స్ సమన్వయంతో గ్రామ పెద్దల సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ ఇబ్రహీం మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, సానుకూల ఆలోచనా విధానం, కష్టపడి పనిచేయడం, పెద్దలను గౌరవించడం, హెల్మెట్ ధరించడం వంటి అనేక అంశాలపై అవగాహన కల్పిస్తూ, జీవితంలో మంచి విలువలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం జనసేన నాయకులు దండి నరేంద్ర విద్యార్థులతో మమేకమై చెట్ల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణలో వాటి కీలక పాత్ర గురించి అవగాహన కల్పించడంతో పాటు, నాటిన ప్రతి మొక్కను మూడేళ్ల పాటు సంరక్షించి 100 శాతం విజయవంతం చేయాలనే సంకల్పంతో దత్తత తీసుకోవాలని సూచించారు. అలాగే, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై మరింత అధ్యయనం చేసి వ్యాసరచనలో పాల్గొనాలని ప్రోత్సహించారు. ముచ్చివోలు ఉపాధ్యాయులు ద్వారా ఉత్తమమైన 5 వ్యాసాలను ఎంపిక చేసి, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు విచ్చేసిన ముఖ్య అతిథులు ద్వారా బహుమతులు అందిస్తామని హామీ ఇచ్చారు. మొక్క నాటడం వరకే పరిమితమవడం కాకుండా దాన్ని పెంచడం మన బాధ్యత, భవిష్యత్ తరాలకు అందించడం మన కర్తవ్యం అని విద్యార్థులకు విశిష్ట అతిథులు సూచించారు. ముచ్చివోలు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన శ్రీకాళహస్తి రూరల్ సీఐ, ఎస్ఐ బాలరాం, హెచ్‌సీ మునిరాజు, కానిస్టేబుళ్లు నాగరాజు, పురుషోత్తం), ముచ్చి వోలు జడ్ పి హెచ్ ఎస్ ఇన్‌చార్జ్ హెచ్ఎం చిరంజీవులు, ఉపాధ్యాయులు, శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు సభ్యులు దండి రాఘవయ్య, గ్రామ పెద్దలు నర్సయ్య, నారాయణ, వెంకట్రామయ్య, మురళి కృష్ణారెడ్డి, వెంకటయ్యలకు, విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# కుటీర పరిశ్రమలకు కూటమి ప్రోత్సాహం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కుటీర పరిశ్రమల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూతనిస్తూ ప్రోత్సహిస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్వర్ణ పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట పట్టణం 16వ వార్డ్‌లో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్)" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని కుటీర పరిశ్రమగా వెదురుతో ఉపాధి పొందుతున్న కుటుంబాలను ఆయన కలిసి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కుటీర పరిశ్రమలకు చేయూతను అందించేందుకు కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నారు. బ్యాంకు రుణాలను సబ్సిడీతో అందిస్తుండగా వాటిని సద్వినియోగం చేసుకొని కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఇంకా వార్డులో ప్రజల నుంచి సమస్యలు ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వాటన్నిటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించనున్నట్టు ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ చిన్ని, బలుసు వాసు, కాటమరెడ్డి అరుణ వాసవి, పిల్లాడి సత్యవతి, వల్లూరి దొరబాబు, బొందల రామలక్ష్మీ శ్రీనివాస్, దేవళ్ళ జయలక్ష్మి, కాపవరపు కుమార్, కుంచె శ్రీనివాస్, లంక నటరాజ్, దుర్గాచారి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలో సుమారు రూ.25 కోట్ల వ్యయంతో జరుగుతున్న, జరగనున్న అభివృద్ధి పనులపై పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప సోమవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే అమృత్ 2.0 వాటర్ స్కీమ్ కింద చేపడుతున్న తాగునీటి అభివృద్ధి పనులపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. పట్టణ ప్రజలకు మెరుగైన, నిరంతర తాగునీటి సౌకర్యం అందించేలా పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే చినరాజప్ప అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, పిల్లాడి సత్యవతి, మున్సిపల్ కమీషనర్ ఎన్ కనకరావు, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## చిరంజీవి 'విశ్వంభర'పై మెగా ప్రకటన? మెగాఫ్యాన్స్ ఎదురు చూపులు ఫలించే రోజు!



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక సోషియో-ఫాంటసీ చిత్రం విశ్వంభర ఇటీవల కాలంలో బాగా ఆలస్యమవుతున్న పెద్ద సినిమాల్లో ఒకటిగా వార్తల్లో నిలుస్తోంది. నిజానికి ఈ భారీ చిత్రాన్ని మొదట జనవరి 2025లోనే విడుదల చేయాలని చిత్ర బృందం భావించింది. అయితే రకరకాల సాంకేతిక కారణాలు సహా ప్రొడక్షన్ డిలే కారణంగా ఈ సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా ఫిలిం నగర్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రాన్ని 16 అక్టోబర్ 2026న విడుదల చేస్తారా? లేక సంక్రాంతి బరిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేపేస్తున్నారా? అనేదానిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. వరుణ్ తేజ్ నటించిన కొరియన్ కనకరాజు మూవీ సక్సెస్ మీట్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ వేడుకలో మెగాస్టార్ తన విశ్వంభర ప్రాజెక్ట్‌కు సంబంధించి ఏమైనా క్రేజీ అప్‌డేట్ ఇస్తారేమోనని అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చిరంజీవి నోటి నుంచి వచ్చే చిన్న ప్రస్తావనైనా సరే ప్రస్తుతం ఈ సినిమాపై తగ్గిన బజ్ ని మళ్లీ పెంచి.. కొత్త ఊపును తీసుకు వస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఒకవేళ అనుకున్న సమయానికి సినిమా వస్తే మెగా అభిమానులకు అది అతిపెద్ద పండగలాంటి వార్తే అవుతుంది. విశిష్ట మల్లిడి దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ డ్రామాలో చిరంజీవి సరసన త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తుండగా.. ఆషికా రంగనాథ్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపిస్తారు. ఇక బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ ప్రతినాయకుడి (విలన్) పాత్రను పోషిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఎమ్.ఎమ్. కీరవాణి సంగీతాన్ని అందిస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

**వసూళ్ల సునామీతో కనకరాజు రూ.50 కోట్ల క్లబ్ వైపు పరుగులు**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ కొరియన్ కనకరాజు థియేటర్లలో బాక్సాఫీస్ వద్ద విజృంభిస్తోంది. ఆగస్టు 7న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా తొలిరోజు నుంచే విమర్శకులు, ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ దక్కించుకుంది. అనంతపురం జిల్లా పెనుగొండ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథకి, ఓ కొరియన్ ఆత్మ ప్రవేశించే వినూత్న అంశాన్ని జోడించి ఫుల్ లెంగ్త్ కామెడీతో రూపొందించడం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించింది. రాయలసీమ మాస్ పాత్రలో వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, నటనతో పాటు కిష్టప్ప పాత్రలో సత్య అందించిన నవ్వుల పువ్వులు ఈ సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక బాక్సాఫీస్ కలెక్షన్ల విషయానికి వస్తే..కొరియన్ కనకరాజు ప్రీమియర్స్ నుంచే భారీ వసూళ్లతో తన సత్తా చాటింది. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 10.2 కోట్ల గ్రాస్ రాబట్టిన ఈ చిత్రం రెండవ రోజు నాటికి రూ. 23.6 కోట్లకు చేరింది.

వీకెండ్‌లో ముఖ్యంగా ఆదివారం నాటి హౌస్‌ఫుల్ షోలతో కలెక్షన్లు మరింతగా పుంజుకోవడంతో ఫస్ట్ వీకెండ్ పూర్తయ్యేసరికి గ్లోబల్ వైడ్‌గా ఏకంగా రూ. 37.4 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి సంచలనం సృష్టించింది. తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ బాక్సాఫీస్ దగ్గర మొదటి వీకెండ్‌లోనే బ్రేక్ ఈవెన్ సాధించి డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలను తెచ్చిపెట్టింది. వీక్ డేస్‌లోనూ థియేటర్ల వద్ద ఇదే జోరు కొనసాగుతుండటంతో ఈ చిత్రం సునాయసంగా రూ. 50 కోట్ల క్లబ్ వైపు దూసుకుపోతోంది.

## వేరే ఆప్షన్ ఉన్నా ఒప్పుకోని వరుణ్.. సత్యకే గ్రీన్ సిగ్నల్?



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు' థియేటర్లలో పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్, కొరియన్ అండర్‌వరల్డ్, అతీంద్రియ శక్తుల కలయికతో వినోదాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ సినిమా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా వరుణ్ తేజ్ నటనతో పాటు కమెడియన్ సత్య కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. ఈ నేపథ్యంలో సత్య ఎంపిక వెనుక ఉన్న ఆసక్తికర కథనాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తుపాకీ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

**వరుణ్ తేజ్ పట్టుబట్టడం వల్లే సత్య ఎంట్రీ:**

ఈ చిత్రంలో కీలకమైన కమెడియన్ పాత్ర కోసం మొదట సత్యనే అనుకున్నప్పటికీ, ఆయన కాల్ షీట్లు ఖాళీ లేకపోవడంతో తీవ్ర ఆలస్యమైంది. దీంతో దర్శకుడు మేర్లపాక గాంధీ వేరే నటుడిని తీసుకుందామని ప్రతిపాదించారు. అయితే కథానాయకుడు వరుణ్ తేజ్ మాత్రం వేరే ఆప్షన్ వైపు చూడటానికి అస్సలు ఒప్పుకోలేదు. ఇక ఎంత లేట్ అయినా పర్లేదు, సత్యతోనే ఈ రోల్ చేయించాలని మొండిగా పట్టుబట్టి కూర్చున్నారు.

**నిజమైన హీరో నమ్మకం:**

వరుణ్ తేజ్ ఉంచిన ఆ నమ్మకమే ఈరోజు థియేటర్లలో నవ్వుల వర్షం కురిపిస్తోంది. సత్య డేట్ల కోసం వేచి చూసి షూటింగ్ చేయడం వల్ల అనుకున్న సమయం కంటే కాస్త ఆలస్యమైనప్పటికీ, వరుణ్ తీసుకున్న నిర్ణయం సరైనదని రుజువైంది.ఇక ఆ క్యారెక్టర్‌కు సత్య తప్ప వేరే ఎవరూ న్యాయం చేయలేరని, ఈ రోజు సినిమా ఈ స్థాయిలో ఆడుతోందంటే అందులో సత్య పాత్ర కూడా ఒక ముఖ్యమైన కారణమని దర్శకుడు మేర్లపాక గాంధీ తెలిపారు.

**థియేటర్లలో వినోదం.. నవ్వుల పంట:**

కొరియా నుంచి వచ్చిన ఓ ఆత్మ హీరోను ఆవహించడం, ఆ తర్వాత జరిగే పరిణామాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నాయి. ఇక ముఖ్యంగా సెకండాఫ్‌లో సత్య, మురళీధర్ గౌడ్ మధ్య వచ్చే కామెడీ ట్రాక్ థియేటర్లలో విపరీతమైన రెస్పాన్స్‌ను రాబడుతోంది. కథలో హారర్ ఎలిమెంట్స్ ఉన్నప్పటికీ, సత్య అందించిన వన్-లైనర్లు మరియు కామెడీ టైమింగ్ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లాయి. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం: ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు సాధిస్తోంది. ఫస్ట్ వీకెండ్ పూర్తయ్యేసరికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 37.4 కోట్ల గ్రాస్ రాబట్టింది. ఏపీ, తెలంగాణల్లో మొదటి ఆదివారానికే బ్రేక్ ఈవెన్ సాధించి డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలను తెచ్చిపెడుతోంది. ఒక నటుడిగా పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకుని, సత్యనే కావాలని పట్టుబట్టిన వరుణ్ తేజ్ నమ్మకం ఈరోజు నిజమైంది. మంచి కంటెంట్, టైమింగ్ ఉన్న కామెడీ కలిస్తే ప్రేక్షకులు ఖచ్చితంగా ఆదరిస్తారని 'కొరియన్ కనకరాజు' మరోసారి నిరూపించింది.

## ఆ దిగ్గజాల్ని తలదన్నే ఫ్యూచర్ పాన్ ఇండియా డైరెక్టర్!





భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఎక్కడ చూసినా టాలీవుడ్ హవానే నడుస్తోంది. రాజమౌళి, సుకుమార్, ప్రశాంత్ నీల్, సందీప్ రెడ్డి వంగా, నాగ్ అశ్విన్ వంటి టాలెంటెడ్ దర్శకులు తెలుగు పరిశ్రమకే పరిమితం కాకుండా గ్లోబల్ స్థాయిలో ఇండియన్ సినిమా సత్తాను చాటుతున్నారు. అయితే ఈ అగ్ర దర్శకుల తర్వాతి తరంలో వారిని తలదన్నేలా? లేదా అంతకు మించిన గ్లోబల్ విజన్‌తో తెలుగు నుంచి రాబోయే ఫ్యూచర్ పాన్ ఇండియా డైరెక్టర్లు ఎవరనే చర్చ వచ్చినప్పుడు ట్రెండ్‌కు తగినట్లుగా ప్రశాంత్ వర్మ - చందు మొండేటిల పేర్లు ముందు వరుస కనిపిస్తున్నాయి. ఈ రేసులో ముందుగా చెప్పుకోవాల్సింది దర్శకుడు ప్రశాంత్ వర్మ గురించే. హనుమాన్ అనే చిన్న సినిమాతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచ స్థాయి అద్భుతాన్ని సృష్టించిన ఆయన ఇప్పుడు జై హనుమాన్, మహాకాళి వంటి ప్రాజెక్ట్‌లతో అసాధారణ సినిమాటిక్ యూనివర్స్‌ను సృష్టిస్తున్నారు. భారతీయ పౌరాణిక అంశాలను మోడరన్ సూపర్ హీరో కాన్సెప్ట్‌తో మిళితం చేయడంలో ప్రశాంత్ చూపిస్తున్న ప్రతిభ, భవిష్యత్తులో టాలీవుడ్ స్థాయిని హాలీవుడ్ రేంజ్‌కు తీసుకెళ్లే అవకాశం లేకపోలేదు. సరైన బడ్జెట్...కావాల్సినంత సమయం, స్వేచ్ఛ ఇవ్వగలిగితే ప్రశాంత్ అద్భుతాలు చేయగలడు. అలాగే కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలను పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా మలచడంలో చందు మొండేటి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. కార్తికేయ 2తో నార్త్ ఆడియన్స్‌ను సైతం విపరీతంగా ఆకట్టుకుని ఒక మిస్టికల్ అడ్వెంచర్ జోనర్‌కు బాటలు వేశారు. ఇప్పుడు అదే సిరీస్‌లో కార్తికేయ 3తో పాటు రాబోయే భారీ ప్రాజెక్ట్‌లతో ఆయన ఇండియన్ బాక్సాఫీస్‌ను ఏలే స్థాయికి ఎదిగే అవకాశం ఉంది. దైవిక అంశాలను, చరిత్రను ముడిపెడుతూ చందు నడిపించే కథా కథనాలు దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను కట్టి పడేస్తున్నాయి. రెగ్యులర్ కథలకు భిన్నంగా చందు ఆలోచనలుంటాయి. యూనిక్ పాయింట్ చుట్టు కథను అల్లడంలో అతడు మాస్టర్. ఇలా ఇద్దరు దర్శకులు కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా బలమైన భారతీయ సంస్కృతిని, పౌరాణిక మూలాలను ఆధునిక సాంకేతికతతో అద్భుతంగా మిళితం చేయగల సత్తా ఉన్నవారు. విజువల్ ఎఫెక్ట్స్, గ్లోబల్ ఆడియెన్స్ టేస్ట్‌ను పక్కాగా అంచనా వేయగలగడమే ఇద్దరిని ఇతర దర్శకుల కంటే ప్రత్యేకంగా నిలబెడుతోంది. రాజమౌళి, సుకుమార్‌ల లెగసీని కొనసాగిస్తూనే భవిష్యత్తులో ఇండియన్ సినిమా దిశను మార్చగల సత్తా వీరిద్దరికే ఉందనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఉన్న సరిహద్దులను పూర్తిగా చెరిపేస్తూ సరికొత్త కథా ప్రపంచాలను సృష్టించగల ఈ ఇద్దరు టాలెంటెడ్ డైరెక్టర్లు టాలీవుడ్ భవిష్యత్తును మరింత బంగారు మయం చేసే అవకాశం లేకపోలేదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని, అద్భుతమైన కథా బలంతో బ్యాలెన్స్ చేయగలిగిన ప్రశాంత్ వర్మ, చందు మొండేటి లాంటి మేధావులే రాబోయే దశాబ్దంలో బాక్సాఫీస్‌ను శాసించే ఫ్యూచర్ పాన్ ఇండియా డైరెక్టర్లుగా అవతరిస్తారు. వీరికి పోటీ జెన్ జీ డైరెక్టర్లు వెలుగులోకి వస్తే మరింత అడ్వాన్స్‌గా ముందుకెళ్లే అవకాశం ఉంది.

## ప్రభాస్ లైనప్.. ఆర్డర్ పక్కాగా ఇదేనా!



రెబల్ స్టార్ ప్రభాస్ లైనప్‌లో ఉన్నవన్నీ వందల కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమాలే. అయితే ఒకేసారి ఇన్ని పెద్ద ప్రాజెక్టులకు కమిట్ అవ్వడంతో, అసలు ఆయన ఈ షూటింగ్ షెడ్యూల్స్‌ని ఏ విధంగా మేనేజ్ చేస్తున్నారనే క్యూరియాసిటీ అభిమానుల్లో విపరీతంగా పెరిగిపోయింది. దీనికి తోడు టాలీవుడ్ ట్రేడ్ వర్గాలు సైతం ఆయన డైరీ ఎలా ఉండబోతోంది అనే విషయాలపై ఆసక్తిగా చర్చించుకుంటున్నాయి. వాస్తవానికి ఒకేసారి రెండు మూడు సెట్స్ మధ్య తిరగడం ఏ స్టార్ హీరోకైనా చాలా కష్టమైన పని. ఒక క్యారెక్టర్ మూడ్ నుంచి మరో క్యారెక్టర్ లోకి వేగంగా మారడం అంత సులువు కాదు. అందుకే రిలీజ్ డేట్లను బట్టి తన షూటింగ్ ప్రయారిటీలను ప్రభాస్ చాలా పక్కాగా సెట్ చేసుకున్నట్లు కనిపిస్తోంది. లేటెస్ట్‌గా బయటకు వస్తున్న అప్డేట్స్ చూస్తుంటే, ఆయన వర్క్ పైప్ లైన్‌లో ఒక పక్కా ఆర్డర్ ఏర్పడినట్లు మనకు క్లియర్‌గా అర్థమవుతోంది. దానికి తగ్గట్లే డేట్స్ సర్దుబాటు జరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రభాస్ ఫస్ట్ ప్రయారిటీ అంతా హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తున్న ఫౌజీ సినిమా మీదే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మూవీని 2026 డిసెంబర్ 3న రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా అనౌన్స్ చేశారు. ఈ రిలీజ్ డేట్‌కు ఎంతో సమయం లేదు కాబట్టి, ముందుగా ఈ ప్రాజెక్ట్‌ను ఎలాంటి బ్రేక్స్ లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేయడం మీదే ప్రభాస్ తన పూర్తి ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తోంది. ఫౌజీ తర్వాత ఆయన టార్గెట్ లిస్ట్‌లో సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ సినిమా ఉండనుంది. ఎంతో క్రేజ్ ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 మార్చి 5వ తేదీన థియేటర్లలోకి తీసుకు రావాలని మేకర్స్ పక్కా డెడ్ లైన్‌గా పెట్టుకున్నారు. ఆ టార్గెట్‌ను మ్యాచ్ చేయాలంటే ఫౌజీ పూర్తయిన వెంటనే ప్రభాస్ ఏమాత్రం గ్యాప్ తీసుకోకుండా స్పిరిట్ సెట్స్‌లోకి అడుగుపెట్టడం చాలా అవసరం.

దానికి తగ్గట్లే వాళ్ళ ప్లానింగ్ జరుగుతోందని ట్రేడ్ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. ఇందులో ప్రభాస్ తొలిసారి పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఇక బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టించిన కల్కి 2898 ఏడీ సీక్వెల్ విషయానికి వస్తే, ఆగస్టు లేదా సెప్టెంబర్ టైమ్‌లో రెగ్యులర్ షూట్ మొదలవుతుందని దర్శకుడు నాగ్ అశ్విన్ గతంలోనే ఒక ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. దానికి తగ్గట్లే ఆ ప్రొడక్షన్ పనులు మొదలైనప్పటికీ ప్రభాస్ పోర్షన్స్ మాత్రం కాస్త గ్యాప్ తీసుకునే సెట్స్ పైకి వెళ్లే ఛాన్స్ ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ లోపు ఇతర నటీనటులతో కాంబినేషన్ సీన్స్ పూర్తి చేసే యోచనలో ఆ టీమ్ ఉన్నట్లు సమాచారం. దీనివల్ల ప్రభాస్ మీద అనవసరమైన ప్రెజర్ తగ్గుతుంది. ఇలా రిలీజ్ డేట్లకు అనుగుణంగా తన డైరీని సెట్ చేసుకోవడం వల్ల, ఒకేసారి ఇన్ని భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులను ఎక్కడా కన్ఫ్యూజన్ రాకుండా చాలా పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తున్నట్లు అర్థమవుతుంది.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**- శాంతియుత ర్యాలీతో జరుగుతున్న నిరసనను పోలీసులు అడ్డుకోవడం అన్యాయం : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య**






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వా మ్యాన్ని అపహాస్యం చేస్తూ ఖూనీ చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బొత్స అప్పలనరసయ్య విమర్శించారు.

సోమవారం ఉదయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదిక నుంచి జరిగిన నిరసన ర్యాలీలో బొత్స మాట్లాడుతూ, ప్రజా స్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుం దన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను, అవకతవకలను ప్రశ్నించే గొంతునొక్కే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని బొత్స విమర్శించారు. రాష్ట్రంలో ఆటవిక పాలనకు ఇది నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టామని, అదే స్థాయిలో నిరసన ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమవుతున్న సమ యంలో తొలుత అనుమతులు ఇచ్చిన పోలీసులే ఆ తర్వాత అడ్డుకోవడం అన్యాయమన్నారు. అంతకుముందు ర్యాలీ చేయడా నికి ప్రయత్నించిన వైఎస్ఆర్సిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వైఎస్ఆర్సిపి నాయకులు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు బార్కెట్లు వేసి నాయకులను నిలువరించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సిరిపురపు జగన్మోహన్రావు, యువనేత బొత్స సాయి గురునా యుడు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారా యణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కోఆర్డినేటర్ బూడి వెంకటరావు, ఎంపీపీలు సింహాద్రి అప్పలనాయుడు, బెల్లాన జ్ఞాన దీపిక, జడ్పిటిసిలు గార తౌడు, వర్రీ నరసింహమూర్తి, రౌతు రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, కృష్ణార్జున, బొద్దల చిన్నమ నాయుడు, జాగారపు అప్పారావు, మాజీ క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ మూర్తి రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, మాజీ జెడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు, బెల్లాన త్రినాధరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మజ్జి గౌరీ కాలనీ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** పార్వతీపురం పట్టణం మజ్జి గౌరీ కాలనీలో చాలా కాలంగా వేధిస్తున్న లో-వోల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర చొరవతో కాలనీలో కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత కొంతకాలంగా మజ్జి గౌరీ కాలనీ, గణేష్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ లో-వోల్టేజ్ కారణంగా గృహోపకరణాలు సరిగా పని చేయడం లేదని స్థానికులు ఎమ్మెల్యే విజయ్ చంద్రను కలిసి విన్నవించారు. సమస్యను సీరియస్‌గా తీసుకున్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులతో సమావేశమై, కాలనీ ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని ఆ ప్రాంతంలో కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుతో ఇకపై నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని అధికారులు తెలిపారు. కాలనీ ప్రజలు ఎమ్మెల్యే విజయ్ చంద్రకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా నిలబడుతుంది : యువనేత బొత్స సాయి గురునాయుడు

**- సోషల్ మీడియా యాక్టివిస్ట్ సంతోష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న యువనేత బొత్స సాయి గురునాయుడు - ఆర్థిక సహాయం చేయడంతో పాటు అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చిన యువనేత బొత్స సాయి గురునాయుడు**




**దత్తిరాజేరు (గజపతినగరం), (రాజధాని వార్తలు):** పార్టీ కోసం నిరంతరం శ్రమించి పార్టీ ఎదుగుదల కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్త కోసం వైఎస్ఆర్సిపి ఎల్లవేళలా అండగా నిలబడుతుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తనయుడు, యువనేత బొత్స సాయి గురునాయుడు అన్నారు. నియోజకవర్గ పరిధిలోగల దత్తిరాజేరు మండలం ఎస్.చింతలవలస గ్రామానికి చెందిన మండల సోషల్ మీడియా యాక్టివిస్ట్ సంతోష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న యువనేత, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తనయుడు బొత్స సాయి గురునాయుడు సంతోష్ ఇంటికి వెళ్లి సంతోష్‌ను పరామర్శించారు. మానవతా దృక్పథంతో స్పందించిన యువనేత సంతోష్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బొత్స సాయి గురు నాయుడు సంతోష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, భవిష్యత్తులోనూ ఆర్థికంగా, అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న సోషల్ మీడియా యాక్టివిస్ట్ సంతోష్ కుటుంబానికి అండగా నిలిచిన బొత్స సాయి గురునాయుడు సేవా దృక్పథంపై కుటుంబ సభ్యులు, స్థానికులు, గ్రామస్తులు వేనోళ్ళ కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శలో బొత్స సాయి గురు నాయుడుతో పాటు మండల వైకాపా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అనిల్ కుమార్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ కు ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఘన నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన అనిల్ కుమార్ దశదినకర్మ సోమవారం ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర నర్సిపురం గ్రామానికి వెళ్లి అనిల్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి అనిల్ కుమార్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ఎమ్మెల్యే విజయ్ చంద్ర ప్రార్థించారు.




# పంట భీమా నమోదులో జాప్యం వద్దు

**- ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా అప్రమత్తం అవసరం : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**

# విద్యాశాఖ ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలి

**- మండల విద్యా వనరుల కేంద్రం ప్రారంభం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** విద్యాభివృద్ధిలో ప్రభుత్వ లక్ష్యాలను విద్యాశాఖ అధికారులు అధిగమించాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఆదివారం సాయంత్రం గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో 53 లక్షల రూపాయలతో నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్యాకల్పన ధ్యేయంగా యువ మంత్రివర్యులు నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించడంతోపాటు మంచి ఫలితాలను సాధించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత కలిగేలా నూతన ప్రణాళికలతో విద్యావ్యవస్థలోని అధికార గణం ముందుకు సాగాలని సూచించారు. అన్ని శాఖల ఉద్యోగాల కన్నా ఉపాధ్యాయ ఉద్యోగ వృత్తి అత్యంత ప్రాముఖ్యత కలిగినదని, బావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అలాగే ఒక ఉపాధ్యాయుడు మాత్రమే అన్ని రంగాల నిపుణులను తయారు చేయగలరని, ప్రభుత్వ లక్ష్యాలను అందుకునే విధంగా కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.




**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఇప్పటివరకు పదిహేనువేల ఆరువందల హెక్టార్లకు మాత్రమే పంట భీమా జరిగిందని, భీమాకు కేవలం నాలుగురోజుల సమయం ఉన్నందున జిల్లాలో రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ఏడిలు ఎంపిడిఓలు, మండల వ్యవసాయాధికారులు, ఎంపిడిఓలు, జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా రైతుల చేత తక్షణమే పంట భీమా నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. పంటల భీమా విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. నాబార్డు అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని నిర్ణీత సమయంలో పంటల భీమా నమోదుకు సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.టి రామారావు, జిల్లా ఉద్యాన అధికారి చిట్టిబాబు, పి.డి మైక్రో ఇరిగేషన్ లక్ష్మి నారాయణ, మండలాల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ ఏ.డీలు, ఎం.పీ.డీ.ఓలు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# "విజన్‌తో ముందుకు సాగితేనే 2047 వికసిత్ భారత్" : కలెక్టర్ హిమాన్షు శుక్ల

### - దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకోవాలని పిలుపు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ వారి చాంబర్లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు "Partners in Nation Building" పేరుతో వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటితో పాటు వాణిజ్య సంస్థలు, కార్యాలయాలపై జాతీయ పతాకాన్ని ఎగురవేసేలా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని, ఆగస్టు 14న జిల్లా యంత్రాంగం, రాజకీయ ప్రతినిధుల ఆధ్వర్యంలో అటవీ, ఉద్యానవన శాఖల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆగస్టు 14, 15 తేదీల్లో ప్రభుత్వ భవనాలు, ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు..త్రివర్ణ పతాక రంగులతో అలంకరించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 10 నుంచి 15 వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల ద్వారా "అనే నేను" కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో తాము ఏం కావాలనుకుంటున్నారో, రాష్ట్రం, దేశ నిర్మాణానికి ఎలా దోహదపడతారో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తూ, ఆ వీడియోలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేసి #PartnersInNationBuilding #MyIndiaMyVision #IndependenceDay2026 #AneNenu ..లతో పోస్ట్ చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులే కాక మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, అధికారులు, ప్రజలు తమ లక్ష్యాలను పోస్ట్ చేయాలని తెలిపారు. అలాగే ఆగస్టు 10 నుంచి 15 వరకు మంత్రులు, అధికారులు, ప్రముఖులు, స్థానిక ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో "అనే నేను" వీడియో క్యాంపెయిన్లో భాగంగా తమ పేరు, రాష్ట్రానికి చేసిన సేవలు, దేశ నిర్మాణానికి చేసిన కృషిని వివరిస్తూ వీడియోలను పోస్టు చేసి, ఇతరులను కూడా ఇదే విధంగా చేయాలని కోరనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా IVRS, వాట్సాప్ బ్లాస్ట్ ద్వారా స్వాతంత్ర్య దినోత్సవ ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రజలందరూ కూడా ఈ ప్రత్యేక స్వాతంత్ర్య దినోత్సవ ప్రచార కార్యక్రమంలో భాగస్వామ్యులై విరివిగా మొక్కలు నాటడం, సంరక్షించడం, విద్యుత్, నీటిని ఆదా చేయడం తదితర సమాజ హిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తోటి వారికి అవగాహన కల్పించాలని, దేశాభివృద్ధికి తమ వంతు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్క పౌరుడు కూడా ఈ దేశాభివృద్ధికి తాను ఎలా పాలుపంచుకుంటాడో ఇప్పటినుంచి ఒక లక్ష్యం నిర్దేశించుకోవాలని, అప్పుడే నిజమైన వికసిత్ భారత్ సాకారం అవుతుందని కలెక్టర్ సూచించారు. ఒక విజన్‌తో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్ కుమార్, డిఆర్‌డిఏ, డ్వామా, మెప్మా పీడీలు నాగరాజు కుమారి, శ్రీనివాస్ ప్రసాద్, కిరణ్ కుమార్, డీఎఫ్ఓలు నాగార్జున రెడ్డి, శ్రీకాంత్, జిల్లా పంచాయతీ అధికారి వసుమతి, సమాచార శాఖ డిడి వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో నైపుణ్యాభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యం

### - స్కిల్ ఇండియా కార్యక్రమంపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్రం సమాధానం - శిక్షణ, సర్టిఫికెట్లతో పాటు ఉపాధి అవకాశాలకు ప్రత్యేక చర్యలు
### - నెల్లూరు జిల్లాలో వేలాది మందికి నైపుణ్య శిక్షణ, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** దేశంలో స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ (సిప్) అమలు తీరు, ఇప్పటివరకు శిక్షణ పొంది, సర్టిఫికేట్ సాధించిన అభ్యర్థుల వివరాలు, అందుబాటులో ఉన్న శిక్షణ కేంద్రాలు, సంస్థల సంఖ్య, శిక్షణ పొందిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, 'స్కిల్ ఇండియా డిజిటల్ హబ్' నిర్వహణ వంటి పలు అంశాలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో కొన్ని ప్రశ్నలు అడిగారు. అడిగిన లిఖితపూర్వక ప్రశ్నలకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సోమవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

**మూడు ప్రధాన పథకాలతో 'స్కిల్ ఇండియా'**

స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ జన్ శిక్షణ్ సంస్థాన్ అనే మూడు ప్రధాన పథకాల ద్వారా అమలవుతోందని కేంద్ర మంత్రి వెల్లడించారు. పి ఎం కె వీవై 4.0 కింద యువతకు షార్ట్–టర్మ్ ట్రైనింగ్‌తో పాటు రీ–స్కిల్లింగ్, అప్–స్కిల్లింగ్ అందిస్తున్నారని, ఇందులో పరిశ్రమలకు తగిన ఆన్–ది–జాబ్ ట్రైనింగ్‌కి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పీఎంకేవీవై పథకం తొలి మూడు వెర్షన్లు అయిన 1.0, 2.0, 3.0లలో (2015–16 నుంచి 2021–22 వరకు) షార్ట్–టర్మ్ ట్రైనింగ్ విభాగంలో ప్లేస్‌మెంట్లను ట్రాక్ చేసినట్లు, అయితే ప్రస్తుతం అమలవుతున్న 4.0 వెర్షన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు తమకు నచ్చిన కెరీర్ మార్గాన్ని ఎంచుకునేలా ఆన్–జాబ్ ట్రైనింగ్ ద్వారా అవగాహన కల్పించడంపై దృష్టి సారించినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఎన్ ఏ పి ఎస్ 2 పథకం ద్వారా అప్రెంటిస్‌లకు నెలకు ఇచ్చే స్టైపెండ్‌లో 25 శాతం (గరిష్ఠంగా రూ. 1,500) సాయాన్ని డీబీటీ ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నామని పేర్కొన్నారు. 15 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన నిరక్షరాస్యులు, డ్రాపౌట్లకు స్వచ్ఛంద సంస్థల ద్వారా స్థానికంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పెంచేందుకు జన్ శిక్షణ్ సంస్థాన్ ఉపయోగపడుతోందన్నారు.



# వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద 310 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత : డిఎస్ఓ ఐ.పుల్లయ్య

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద 310 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నామని డిఎస్ఓ ఐ.పుల్లయ్య అన్నారు. ఆదివారం రాత్రి వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా, ఏపి 26 టిఇ 1233 నంబరు గల లారీలో అక్రమంగా తరలిస్తున్న 620 బస్తాల పీడీఎస్ బియ్యం (310 క్వింటాళ్లు) గుర్తించి స్వాధీనం చేసుకున్నారని సోమవారం డిఎస్ఓ డిఎస్ఓ ఐ.పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్వాధీనం చేసుకున్న లారీతో పాటు పీడీఎస్ బియ్యాన్ని వెంకటాచలం పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. ఈ ఘటనకు సంబంధించి 6–ఏ నివేదికను సిద్ధం చేసి సంబంధిత అధికారులకు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు, అక్రమ నిల్వలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం, ఆత్మకూరు సిఎస్డిటిలు సైమన్ బాబు, అజేయుల్లాఖాన్ పాల్గొన్నారు.

# కరప మండలంలో వైసీపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

### - డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి : కన్నబాబు : విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి









**కరప, (రాజధాని వార్తలు):** డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కరప మండలంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, కాకినాడ రూరల్ నియోజ కవర్గ వైసీపీ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి నియోజక వర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమా నులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

పార్టీ జెండాలు, ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. తూరంగి డీమార్ట్ వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ర్యాలీ నడకుదురు, పెనుగుదురు మీదుగా కరప గ్రామానికి చేరుకుంది. అనంతరం కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వరకు కొనసాగింది. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం నాయకులు ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

**యువత భవిష్యత్తుతో చెలగాటమా?**

డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. నిరు ద్యోగ యువత భవిష్యత్తుకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని కోరారు. సీబీఐ దర్యాప్తుతో వాస్తవా లను వెలుగులోకి తీసుకురావడంతో పాటు బాధ్యు లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏవీ?**

విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని నాయకులు కోరారు. బకాయిల కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులపై భారం పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**నిరుద్యోగ భృతి హామీ ఏమైంది?**

నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతకు అండగా నిల వాల్సిన ప్రభుత్వం హామీల అమలులో కాలయాపన చేయడం సరికాదని విమర్శించారు.

**మహిళలకు రూ.1,500 ఏమైనట్లు?**

ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు నెలకు రూ.1,500 అందిస్తామని ఇచ్చిన హామీని ప్రభు త్వం మరిచిపోయిందని వైసీపీ నాయకులు విమర్శిం చారు. మహిళలకు ఇచ్చిన హామీపై స్పష్టత ఇవ్వా లని, ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రజల పక్షాన పోరాటం**

ఈ సందర్భంగా కురసాల కన్నబాబు మాట్లా డుతూ డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరి పించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరి ష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతిని ధులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చదువుకుని సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలి - రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మల్లెమాల ప్రమీల పిలుపు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** సమాజంలో నిరుపేదలకు, అనాథ పిల్లలకు చేయూతనందించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మల్లెమాల ప్రమీల పిలుపునిచ్చారు.

ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తల్లితండ్రులు లేని, అత్యంత నిరుపేదలైన విద్యార్థినులు యూనిఫామ్‌ల కొరతతో ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే స్పందించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. కళా శాల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 25 మంది అర్హులైన పేద విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్య మా దృష్టికి వచ్చిన అతి తక్కువ సమయంలోనే స్పందించి, పిల్లలకు బట్టలు అందజేయడం ఎంతో తృప్తినిచ్చింది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని, మీ గ్రామానికి, చదివిన కళాశాలకు, కన్నవారికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. సరికొత్త దుస్తులు అందుకున్న విద్యార్థి నులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. రోటరీ క్లబ్ చేసిన ఈ ఉదార సేవలను కళాశాల యాజమాన్యం, విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సేవా కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి మ్యాగీ క్లారా, సభ్యులు కృష్ణ కుమార్, సదానందం, ఎమ్మెస్ రెడ్డి, ప్రమీల, కళాశాల ప్రిన్సిపాల్ భారతితో పాటు అధ్యాపకులు, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజ్, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, దోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అంతర్జాతీయ పార్శిల్, స్పీడ్ పోస్ట్ సేవల ద్వారా విదేశాల్లోని ప్రియమైన వారికి రాఖీలు, బహుమతులు పంపండి



**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాఖీ పూర్ణిమ సందర్భంగా విదేశాల్లో నివసిస్తున్న తమ ప్రియమైన సోదర సోదరీమణులకు రాఖీలు మరియు బహుమతులు సకాలంలో అందజేయడానికి ఆంధ్రప్రదేశ్ పోస్టల్ శాఖ ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తోంది. పోస్ట్ ఆఫీసులు మరియు బ్రాంచ్ పోస్ట్ ఆఫీసుల ద్వారా అంతర్జాతీయ పార్శిల్ మరియు స్పీడ్ పోస్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవల ద్వారా రాఖీలు, బహుమతులు మరియు ఇతర వస్తువులను విదేశాలలోని ప్రియమైన వారికి సురక్షితంగా మరియు త్వరగా పంపవచ్చు. ఈ సంవత్సరం రాఖీ పూర్ణిమ 28.08.2026 న జరుపుకోనున్న నేపథ్యంలో, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సేవలను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కోరడమైనది. పార్శిళ్లను సకాలంలో పంపడానికి వెంటనే సమీప పోస్ట్ ఆఫీసును సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి. మరిన్ని వివరాలకు స్థానిక పోస్ట్ ఆఫీసును సంప్రదించగలరు.

**ఎమ్. నరసింహ స్వామి**
**సీనియర్ సూపరింటెండెంట్ పోస్టల్, కార్యాలయము**
**విజయవాడ డివిజన్, విజయవాడ-01**

# కరప పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు





**కరప, (రాజధాని వార్తలు):** మండల కేంద్రం కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎం ఎస్ఎంఏ) పథకంలో భాగంగా ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ ఏంజలిన్, డాక్టర్ అఫ్రోజ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గురజనాపల్లికి చెందిన చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ పద్మజా శ్రీదేవి గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ పౌష్టికాహారం అందించడం అభినందనీయమని వైద్యాధికారులు ఆమె సేవాభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముద్రగడ్డ రమేష్, కాకినాడ పార్లమెంట్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు దేవు వెంకన్న, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పీహెచ్ఎన్ సత్యనారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్ వనం శ్రీనివాసరావు, ఎన్.వీరభద్రరావు, మంచాల శ్రీనివాస్, హెచ్ఎస్ రాజగోపాల్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలు చెయ్యొద్దు : సీఐ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సోషల్ మీడియా ఘటనలు, సామాజిక సమస్యలపై అసత్య ప్రచారాలు చేయవద్దని సామర్లకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ కృష్ణ భగవాన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సామర్లకోట రైల్వే స్టేషన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావుపై దాడి జరిగినట్లు వచ్చిన ప్రచారం అవాస్తవమన్నారు. ఎస్సై గరగారావు ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అప్పారావు అనే వ్యక్తి మద్యం మత్తులో రావటంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కానీ అప్పారావు ట్రాఫిక్ ఎస్ఐ పైన దాడి చేసినట్లు ప్రచారం సాగటం దారుణం అన్నారు. మద్యం సేవించిన వ్యక్తులు కొంచెం అతిగా ప్రవర్తించడం సహజమని సీఐ కృష్ణభగవాన్ వివరించారు. అంత మాత్రాన దాడులు చేసినట్లు ప్రచారం చేయటం సరికాదన్నారు. మద్యం సేవించిన వ్యక్తులు బైక్లు, స్కూటర్లు, ఇతర వాహనాలు నడపడం వలన ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. మద్యం సేవించిన వ్యక్తులు వాహనాలను నడిపితే చర్యలు తప్పవని సిఐ కృష్ణ భగవాన్ హెచ్చరించారు. అలాంటి అసత్య ప్రచారలు మానుకోవాలని, ప్రజలు వాటిని నమ్మవద్దని సిఐ స్పష్టం చేశారు.

# ప్రమాద ఘంటికలు...పైపులైను లీకులు...!





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలో తాజాగా సుమారు 30 మంది చిన్నారులు అశ్వస్థతకు లోనయ్యారు. త్రాగు నీరు, ఇతర పరిస్థితులు దీనికి కారణంగా చెబు తున్నారు. అయితే అదే ప్రమాదం పెద్దాపురం పట్టణానికి పట్టే అవకాశం ఉంది. పెద్దాపురం పట్టణ ప్రజలకు త్రాగునీరు అందించే పైప్ లైనుకు మాటిమాటికీ లీకులు ఏర్పడుతుందటంతో ప్రజలు ఆరోగ్యా పరంగా సమస్యలు ఎదుర్కొనే అవాకాశలు కనిపిస్తున్నాయి. సామర్లకోట – పెద్దాపురం రోడ్డులోని ప్రసన్న ఆంజనేయ ఆలయం వద్దగల విటికర్ బాలికోన్నత పాఠశాల గేటు వద్ద త్రాగునీటి ప్రధాన పైప్ లైనుకు లీకులు ఏర్పడి గత కొద్ది రోజులుగా విలువైన త్రాగునీరు వృధా అవుతుంది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

అధికారుల నిర్లక్ష్యం వలన పైపు లైనులోకి వ్యర్దాలు చేరి త్రాగునీరు కలుషితవుతుంది. ప్రక్క మున్సిపా లిటీ అయిన సామర్లకోటలో పలువురు చిన్నారులు అశ్వస్థతకు గురైనా ఇక్కడ అధికారులు పైపులైను లీకులను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. తక్షణమే పైపులైను లీకులను అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan